# ఆహార కల్తీ..రోగాలతో కుస్తీ

హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త

ఇటీవల ఇద్దరు మిత్రులు ఒక రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ కర్రీ, రొట్టెలు ఆర్డర్ చేశారు. కొద్దిపేసటి త ర్వాత వెయిటర్ వాటిని తీసుకొచ్చాడు. అది తింటుంటే కుళ్లిన వాసన వచ్చింది. ఇందేంటని అడిగితే స్పందన లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరికి చెప్పాలో అవగాహన బోర్డులు లేవు. తిని రోగాలు తెచ్చుకోవడం కంటే తినకుండా బిల్లు చెల్లించడం బెటర్ అని వచ్చేశారు. ఇది నగర శివారు ప్రాంతాల్లోనే కాదు..రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పలు రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.ఇక నగర శివారు మున్సిపాలిటీల ప్రాంతాల పరిధిలో తనిఖీలు చేసేవారే కనిపించడంలేదు.అయితే ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై జిహెచ్‌ఎంసి ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు సోమాజిగూడలోని ఒక రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో పుట్టగొడుగులు, నువ్వుల నూనె, పాల ప్యాకెట్ తదితర ఆహార ప్యాకెట్లు గడువు ముగిసినట్లు తేల్చారు. బిర్యానీ తయారు చేసే ప్రాంతంలో నీరు నిలవడం, ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులపై లేబుల్స్ సరిగా లేవని తేల్చారు. వంటగది కిటికీకి అమర్చిన మెష్‌లో పావురం రెట్టలు ఉండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు నిర్ధారించారు.నగరంలో, శివారు ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభిస్తు నేపథ్యంలో..నగరంలో చిన్నవి పెద్దవి కలిసి సుమారు 25వేల వరకు హోటళ్లు ఉంటాయి. నగరంలో బిర్యానీ, మాంసాహారం ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచాయి. వేలాదిగా ఉన్న హోటళ్లలో రోజు లక్షలాది మంది భుజిస్తుంటారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వారంలో 5 రోజులపాటైనా హోటళ్లు, మిఠాయి షాపులు, బేకరీలను తనికీలు చేసి ఆహార నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. కానీ వారు కార్యాలయాల నుంచి కదలడం లేదన్న ఫిర్యాదులున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన తనిఖీ సమయంలో కుళ్లిన ఆహార పదార్థాలు, లేబుల్ లేని తినుబండారాలు తయారు ప్రదేశాలను గుర్తించి తనిఖీచేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలతోపాటు తయారు చేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం చూసి నివ్వెరపోయారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా తినే ఆహారంలో అనేక మార్పులొచ్చాయి. భుజించే ఆహారంలో కల్తీ పెరుగుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

**అడ్డుకునే వారు లేదు..**

నగరంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోంది.



జిహెచ్‌ఎంసి ఆరోగ్య విభాగం మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో చివరకు చిన్నారులు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి టీ ఫౌడర్ వరకు కల్తీ అధికమైంది. 10కేజీల టీ ఫౌడర్‌లో ఒక కేజీ ఐరన్ పొడి కలిపి విక్రయిస్తున్నారని సమాచారం. చాలా హోటళ్లలో కుళ్లిన మాంసం, పాడైన వస్తువులతో వండి వారుస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో లక్షలాది మంది నాణ్యత లేని ఆహారాన్నే తినాల్సి వస్తోంది. బల్దియా పరిధిలో సుమారు 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా చాలా మంది ప్రధాన కార్యాలయాన్ని వదిలి క్షేత్రస్థాయికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. చిన్న హోటల్ నుంచి మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఆహారం కల్తీ జరుగుతుంది. వంటల్లో నాణ్యమైనా మంచి నూనె వాడడం లేదు. కొన్నిసార్లు వాడిన నూనెను పదేపదే వాడడంతో విష పదార్థాలు తయారవుతున్నాయి. తాజా కూరగాయలతో వంటలు చేయక పోవడం, బిర్యానీల్లో ఆకర్షించేలా రంగులను వాడుతున్నారు. నూడుల్స్ రుచిగా ఉండేలా కొన్ని పదార్థాలు కలుపుతుంటారు. ప్రతి ఆహార పదార్థాల్లో కల్తీ చేసి విక్రయిస్తుంటారు. జాగ్రత్తగా గమనించి కొనుగోలు చేయాలి. క్షేత్రస్థాయిలో నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నా పరిశీలించాల్సిన అధికారులు కానరావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుపై లేబుల్ ఉంచాలి. తయారీ తేదీ, అందులో కలిపే వస్తువులు, గడువు వివరాలు ఉండాలి. మార్కెట్లలో పలు రకాల అప్పాలు, పచ్చళ్లు, చిప్స్, కారం, బందో, పాపుడాలు, అప్పడాలు, పచ్చళ్లు, చిన్న పిల్లలు తినే ప్యాకెట్లు అనుమతులు లేకుండానే తయారు చేస్తున్నారు. శివారు ప్రాంత జిల్లాల వారీగా ఆహార కల్తీ నిరోధక శాఖలను ఏర్పాటు చేశారు. జిల్లాకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించారు. అధికారులు ఆహార భద్రత, పరిరక్షణ, ప్రమాణాలను పర్యవేక్షించాలి. వీరికి సహాయకులుగా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు. అయినా వీరి పర్యవేక్షణ, తనిఖీలు, కేసుల నమోదులు కనిపించడంలేదు.

**వ్యాధులకు మూలం..**

నాణ్యతను అసలు పట్టించుకోవడం లేదు. మాంసాహార వంటకాలకు రంగు తెప్పించేందుకు నిషేధిత టర్‌ట్రాజైన్ అనే సింథటిక్ రసాయానాన్ని కలుపుతున్నారు. అలాగే యూరియాతో పాలు తయారు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చాయి. అయినా నగర ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మిఠాయిల్లోనూ నాణ్యత ఉండడంలేదని గతంలో ఫిర్యాదులు, తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. నాసిరకం వంట నూనెలు తయారవుతున్నాయి.అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారి వెలుగులోకి వచ్చినా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు. జిహెచ్‌ఎంసి ఉన్నతాధికారులు కనీస సమీక్ష చేయడం లేదు. బయటి ఆహారం తినడంలో చాలా రోగాలు వచ్చే అవకాశముంది. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. ప్రస్తుతం చాలా మంది ఆర్డర్ పెట్టి ఫుడ్ ఇంటికి తెప్పించుకుంటున్నారు. వారు ప్రమాదకరమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు.మంచి నూనె వాడకపోవడం, వాడినా నూనెనే మళ్లీ వాడడంతో కడుపు నొప్పి వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం, అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గిపోవిడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. తర్వాత అది పచ్చకామెర్లకు దారి తీసి క్యాన్సర్ కూడా రావచ్చు. కవర్లలో టీ, కూరలు, బిర్యానీ పార్సిల్ తీసుకుపోతుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యులు,ముందుగా అనారోగ్య సమస్యలు తప్పవని పేర్కొంటున్నారు.



హైదరాబాద్ వార్త

# సమగ్ర కుటుంబ సర్వేపై సైబర్ నేరగాళ్ల కన్ను

**-డిజిటల్‌గా పత్రాలు పంపాలంటూ మోసగించే యత్నం**

**-సర్వేపేరుతో ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు,లింకులు పంపే అవకాశం**

**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన**



హైదరాబాద్, నవంబర్ 8,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వేపై సైబర్ నేరగాళ్ల కన్ను పడింది. ఆన్‌లైన్‌లో సర్వే, డిజిటల్‌గా కొన్ని పత్రాలు పంపాలంటూ నేరస్థులు మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారు. సర్వేలో భాగంగా కాల్ చేశామని, అడిగిన పత్రాలు ఇవ్వాలంటూ కాల్స్ వస్తున్నట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఈనేపథ్యంలో కుటుంబ వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఇటీవల మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు పరిహారం పేరుతో మోసగించేందుకు ప్రయత్నించారు. హైదరాబాద్‌లోని కొందరికి ఏపీకే(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ) ఫైళ్లు పంపించారు. ఇప్పుడు కుటుంబ సర్వేను అస్త్రంగా మార్చుకున్నారు. ఈ తరహా మోసాలపై ఇప్పటివరకూ కేసులు నమోదవ్వకున్నా సర్వే పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు ఎట్టి పరిస్థి తుల్లో నమ్మొద్దని పోలీసులు ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వ సిబ్బంది నేరుగా ఇళ్లకు వచ్చి మాత్రమే వివరాలు నమోదు చేసుకుంటారు. ఎలాంటి పత్రాలు తీసుకోరు. పని ఒత్తిడి, వ్యాపారంతో తీరిక లేకుండా ఉండడం, ఇతర ప్రాంతాల్లో పర్యటనల దృష్ట్యా సర్వే ఎప్పుడు పూర్తవుతుందోనని కొందరు ఎదురు చూస్తుంటారు. ఇలాంటి వారినే సైబర్ ముఠాలు లక్ష్యంగా చేసుకునే అవకాశముంది.

**ఒక వేళ అనుమానాస్పద లింకులపై క్లిక్ చేస్తే ...**

నేరగాళ్లు కుటుంబ సర్వేలో భాగంగా కాల్ చేస్తున్నామని.. ఆధార్, పాన్ తదితర గుర్తింపు పత్రాలు పంపాలని లేక పోతే తాము పంపించే లింకును క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని నమ్మిస్తారని పోలీసులు చెబుతున్నారు. వాట్సాప్‌కు వెబ్‌లింకులు, ఏపీకే ఫైల్ పంపిస్తారని.. గూగుల్ ప్లేస్టోర్, ఐస్టోర్‌లో లేని యాప్‌లనే ఏపీకే ఫైళ్ల ద్వారా పంపిస్తారని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఒకవేళ నిజమేనని నమ్మి వీటిని క్లిక్ చేస్తే ప్రమాదకర యాప్‌లు డౌన్‌లోడ్ అవుతాయని తెలిపారు. తద్వారా ఫోన్ పూర్తిగా నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లి ఫొటోలు, బ్యాంకు ఖాతా నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లి మనకు వచ్చే కాల్స్‌ను కూడా నేరస్థులు వినొచ్చున్నారు. బ్యాంకు ఖాతా నుంచి డబ్బు కొట్టేయడం, వ్యక్తిగత ఫోటోలతో బెదిరింపులకు దిగడం వంటివి జరుగుతాయన్నారు. ఒక వేళ సర్వే పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేసినా.. మోసపోయినా వెంటనే ఫిర్యాదుచేయాలని సూచిస్తున్నారు.

**సిబ్బంది ఎలాంటి పత్రాలు తీసుకోరు...**

సర్వే సిబ్బంది నేరుగా ఇళ్లకే వచ్చి సమగ్ర వివరాలు నమోదు చేసుకుంటారు. ఆధార్, రేషన్, పాన్ కార్డులతో సహా ఎలాంటి ధ్రువీకరణ డాక్యుమెంట్లనూ తీసుకోరు.ఫొటోలు అడగరు.. కెమెరాతో ఎటువంటి సమాచారాన్ని చిత్రీకరించరు. ఆధార్ అనుసంధానం అంటూ మెషిన్లు తీసుకొచ్చి వేలిముద్రలు సేకరిస్తామంటే అసలు నమ్మొద్దు. ఎవరైనా ఫోన్ చేసి ఆయా వివరాలు అడిగితే మోసమని అలర్ట్ అవ్వాల్సిందే సర్వే పేరుతో వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేసినా, మోసపోయినా వెంటనే 1930టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించి కంప్లైంట్ చేయాలని తెలుపుతున్నారు.

# నార్సింగి ఔటర్‌పై బోల్తాపడ్డ ఇసుకలారీ

**- ట్రాఫిక్‌జాంతో ఇబ్బందులు పడ్డ వాహనదారులు**

**నార్సింగి, నవంబర్ 8 ప్రభాతవార్త :** అధిక లోడ్‌తో ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న ఇసుకలారీ టైర్ పగులడంతో బోల్తాపడింది. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం ఏర్పడింది. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తెలంగాణ పోలీసు అకాడమి నుంచి కోకాపేట్ వైపుకు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారు జామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ టైర్ ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో వేగం అదుపు తప్పిన ఆ లారీ ఔటర్‌పైనే బోల్తాపడింది. ఈ సంఘటనతో ఔటర్‌పై వెళ్తున్న వాహనాలన్నీ ఆగిపోవడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం అయ్యింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీని ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి క్రేన్‌ల సహయాంతో పక్కకు తొలగించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించంతో తృటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. స్వల్ప గాయాలపాలయ్యాడు. నిత్యం ఔటర్‌పై అధిక లోడ్‌తో లారీలు, డిసిఎంలు దూసుకు పోతున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ఫలితంగానే ఇలాంటి ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయని స్థానికులు, వాహనదారులు పేర్కొన్నారు. మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే రవాణాశాఖ అధికారులు అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలను తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయడుతున్నారు.

# కొంపల్లిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం..



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఎన్.కోటిరెడ్డి

పేట్ బషీరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త

పదవ తరగతి ఫెయిల్ అయ్యాడు. జల్సాలకు అలవాటుపడ్డాడు. బేకరీలో పార్ట్‌టైం జాబ్ చేసుకుంటే చాలిచాలని డబ్బులతో విరక్తి చెందాడు. విలాసవంతమైన జీవనం కోసం పక్కదారీ పట్టాడు. ప్రభుత్వ నిషేదిత మాధక ద్రవ్యాలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేపడుతూ చివరకు పోలీసులుకు చిక్కి జైలుమెట్లు ఎక్కిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి పేట్ బషీనాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు కొంపల్లిలో ఓ యువకుడు ఎండిఎంఎ డ్రగ్‌ను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం అతడి వద్ద డ్రగ్స్ లభ్యం కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. గుజరాత్‌కు చెందిన గౌలాని ఆషీఫ్ (30) గత కొన్నాళ్ల కిందట నుండి తన కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వలస వచ్చి కొంపల్లిలో ఉంటూ బేకరిలో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కాగా కుటుంబ అవసరాలకు, జల్సాలకు డబ్బులు చాలకపోవడంతో మత్తు పదార్థాల వ్యాపారంలోకి దిగాడు. దీంతో ఎండిఎంఎ డ్రగ్స్‌ను మహారాష్ట్ర, ముంబాయి నుండి దిగుమతి చేసుకొని స్థానికంగా ఆన్‌లైన్ ద్వారా కస్టమర్లతో అమ్మకాలు చేపడుతున్నారు. నిందితుడి వద్ద లభించిన 20 గ్రాముల ఎండీఎంఎ రూ.4లక్షల 40వేల విలువ డ్రగ్స్‌తో పాటు మరో ముగ్గురు కొనుగోలు చేసిన నిందితులను అదుపులోకి తీసుకొని ప్రధాన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ అదనపు డీసీపీ పి.శోభన్‌కుమార్, ఏసీపీ రాములు, పేట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, ఎస్‌ఓటీ సీఐ ఆర్.శ్యామ్ సుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఫ్లైఓవర్ నిర్మాణం పనులు వేగంతం చేసేందుకు చర్యలు : ఎంపి ఈటెల



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, బోర్డు అధ్యక్షులు నంజూన్ దీశ్వర్, సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 8 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జెబిఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు,ప్యారడైజ్ నుంచి కొంపల్లి వరకు చేపట్టనున్న ఫ్లై ఓవర్ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించి 34 అంశాలపై చర్చించి బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎన్.వి. నంజూన్ దీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోర్డు సిఈఓ డి.మధుకర్ నాయక్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, డిప్యూటీ సిఈఓ విజయ్ కుమార్ బాలన్ నారాయర్‌లు పాల్గొని పలు ఎజెండాలపై చర్చించి తీర్మాణం చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలకు 60 మీటర్ల వెడల్పును తగ్గించాలని, ఫ్లైఓవర్ నిర్మాణాల్లో నష్టపోయే ఇండ్ల స్థలాల యజమానులకు, షాప్ యజమానులకు వంద శాతం నష్టపరిహారం చెల్లించాలని ఎంపీ ఈటెల రాజేందర్ బోర్డు దృష్టికి తెచ్చారు. రోడ్ల నిర్మాణాలకు నిధులు వెంటనే విడుదల చేయాలని, రైల్వే లైన్ దగ్గర జంక్షన్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే మరమ్మత్తు చేపట్టాలన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాల వల్ల రూ.330 కోట్ల విలువ చేసే రక్షణ శాఖ కంటోన్మెంట్ భూములను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, దానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వబోతుంది. ఆ డబ్బును కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేయకుండా కాలయాపన చేయకూడదన్నారు. కంటోన్మెంట్‌లో జమ చేస్తే అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతాయన్నారు. కంటోన్మెంట్‌లో మంచినీటి సమస్య పరిష్కారానికి ఈ నెల 13వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు సభ్యుడు రామక్రిష్ణ తెలిపారు. మంచినీటి సమస్యపై ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెల 12వ తేదీలోపు ఆయా బస్తీలు, కాలనీల వాసులు ఫిర్యాదు చేయాలన్నారు. కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40 కోట్లు రావాల్సి ఉందన్నారు.

## మందుపార్టీలకు అనుమతి తప్పనిసరి

**-ఫంక్షన్‌హాల్స్,ఫాంహౌజ్‌లకు ఎక్సైజ్‌శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్, నవంబర్ 11,ప్రభాతవార్త:** కోట్ల ఖర్చు చేసి ఫామ్ హౌస్‌లు, కన్వెషన్లు, బంకెట్ హాల్స్, క్లబ్‌ల నిర్మాణాలు చేపడుతారు. రూ. లక్షలు ఖర్చు చేసి విందులు వినోదాలు చేసుకుంటారు. చేసుకుంటున్న ఫంక్షన్లకు బంధువులు సన్నిహితులను పిలుచుకుంటారు. వచ్చిన వారందారికి కడుపునిండా భోజనాలు, సుక్కా, ముక్కాలు ఏర్పాటు చేస్తారు.ఫంక్షన్స్ హాల్స్ నుంచి డేకరేషన్ వరకు ఎంతో ఖర్చులు పెడుతారు కాని.. ఫంక్షన్లలో మద్యం వినియోగానికి ఎక్సైజ్‌శాఖ నుంచి మాత్రం అనుమతులు తీసుకోకుండా తనిఖీల్లో పట్టుబడుతూ పరువు మర్యాదాలకు భంగం వాటిల్లే పనులు చేస్తున్నారు. నిర్వహకులకు తెలియక పోయిన కనీసం ఫంక్షన్ హాల్ నిర్వాహకులు కూడ పప్పులో కాలేస్తూ ఎక్సైజ్ శాఖ వేసే జరిమానాలకు నోటీసులు అందుకుంటున్నారు. హైదారాబాద్ రంగారెడ్డిల్లోని శివారు ప్రాంతాల్లో వందల కొద్ది బంకెట్ హాల్స్, కన్వేషన్లు, క్లబ్ హౌజులు, ఫామ్ హౌస్ లు, ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. వీటిల్లో నిత్యం ఏదో పార్టీ జరుగుతుంది. మద్యం పార్టీ జరుగుతున్నప్పుడు ఎక్సైజ్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని అధికారులు ఎన్నిమార్లు చెప్పిన అందరు పెడ చేవిన పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఫామ్ హౌస్ లు ఫంక్షన్ హాల్స్ , క్లబ్ హౌజులు, కన్వేషన్లు, రీసాట్స్‌లల్లో మద్యం పార్టీ నిర్వహించాలని అనుంటే ఎక్సైజ్ నుంచి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. లేని పక్షంలో ఫంక్షన్ హాల్ నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడంతో పాటు ఫంక్షన్ హాల్స్‌ను బ్లాక్ లిస్టులో పెడుతామని హెచ్చరిస్తున్నారు.

# 18ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేసుకోవాలి



వివిధ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ అహ్మద్ నదీమ్ తదితరులు

**-ఓటరు జాబితాలో సవరణలకు ఈనెల 28వరకు అవకాశం**

**-నేడు,రేపు అన్ని బూత్‌లలో ప్రత్యేక క్యాంపెయిన్**

**-తప్పులు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలి**

**-హైదరాబాద్ -రంగారెడ్డి జిల్లా రోల్ అబ్జర్వర్ అహ్మద్ నదీమ్**

హైదరాబాద్ నవంబర్ 8 ప్రభాతవార్త: తప్పులేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని హైదరాబాద్ -రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు,రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం అన్నారు.ఈమేరకు శుక్రవారం సాయత్రం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఓటరు జాబితా తయారు పై పలు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ప్రధాన భూమిక ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరంలాగానే ఈఏడాది సైతం ఓటరు జాబితాలో తప్పుల సవరణ కు అవకాశం కల్పించారన్నారు. ఆజాబితాలో క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ అక్టోబర్ 29నుండి నవంబర్ 28 వరకు అవకాశం ఉందన్నారు. అలాగే 9.10 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉంటుందన్నారు. డిసెంబర్24 న క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్ పరిష్కారం చేస్తారని తెలిపారు. అలాగే తుది ఓటరు జాబితాను జనవరి6న విడుదల చేస్తారని పేర్కొన్నారు. కావున ఓటరుజాబితాపై అనుమానాలు, అపోహలు లేకుండా పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. శని,ఆదివారాల్లో జరిగే క్యాంపెయిన్‌లో ఓటరుజాబితాలో తమ పెరుందో లేదో తెలుసుకునేందుకు బూత్ లెవెల్ అధికారి బూత్ వద్ద ఉదయం 10.30 గంటల నుండి. సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఈవిషయంపై ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు క్షేత్రస్థాయిలో ర్యటించి బూత్‌స్థాయి అధికారులపై పర్యవేక్షణ చేయాలన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా బూత్ స్థాయి ఏజెంట్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగేజనవరి 1, 2025 తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చునని అన్నారు అందుకు కాలేజీ లలో ఓటరు నమోదు కు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రంగా రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు కాంగ్రెస్ పార్టీ తరపున నాగర్ కర్నూల్ ఎం పి మల్లు రవి, ఎం ఐ ఎం ఐ పార్టీ తరువున చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్ అలి, బి జేపీ పార్టీ తరపున మాజీ మంత్రి .మర్రి శశిధర్ రెడ్డి,ఏడేళ్లి అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ తరుపున పి రాజేష్ కుమార్, బహుజన పార్టీ తరపున కే నంద కుమార్ ఆమ్ ఆద్మీ పార్టీ తరపున మొహమ్మద్ సొహెల్ సిపిఎం పార్టీ తరపున ఎం శ్రీనివాస్, బి అర్ యస్ పార్టీ తెలుగు దేశం, ఎం ఐ ఎం పార్టీ ప్రతినిధి ఖాజా మొయినుద్దీన్ బి జేపీ పార్టీ ప్రతినిధి కొల్లూరు పవన్ కుమార్ పాల్గొన్నారు.

# 300 మంది పురోహితులతో మృత్యుంజయ యాగం



కార్మాన శ్రీ మహంకాలి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమెమ్మెల్యే శ్రీగణేష్ వేద పండితులు తదితరులు

కంటోన్మెంట్,నవంబర్ 8 ప్రభాతవార్త:

ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని, సిఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మానలోని శ్రీ మహంకాలి దేవాలయం ప్రాంగణంలో శ్రీ లక్ష్మి గణపతి యాగం, మృత్యుంజయ యాగం, నవ ఛండీ యాగం, శతరుద్ర యాగం వంటి ప్రత్యేక పూజలు వేద మంత్రోచ్చరణలతో పెద్ద ఎత్తున నిర్వహించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ దేవాలయాల్లో పనిచేస్తున్న 300 మంది పురోహితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటే రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉంటారని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

# పంజగుట్టలో హోంగార్డు పైకి దూసుకెళ్లిన కారు

హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త

పంజగుట్టలో కారు బీభత్సం సృష్టించింది. హోంగార్డు పైకి కారు దూసుకెళ్లింది. పంజాగుట్ట నాగార్జున సర్కిల్ లో నాలుగు రోజుల క్రితం ఓ కారు డ్రైవర్ చేసిన బీభత్సం తాజాగా వెలుగులోకి వచ్చింది. నాగార్జున సర్కిల్ వద్ద వాహనాల బ్లాక్ ఫిల్మ్ చెకింగ్ జరుగుతోంది. ఇందులో భాగంగా హోంగార్డు రమేశ్ ఓ కారును ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే డ్రైవర్ సయ్యద్ నజీర్ కారు ఆపకుండా ముందుకెళ్లబోయాడు. దీంతో రమేశ్ కారుకు అడ్డుగా వచ్చి ఆపబోయాడు. డ్రైవర్ మరింత వేగంగా కారును పోనిచ్చి రమేశ్‌పైకి దూసుకెళ్లాడు.హోంగార్డును కారుతో కొంత దూరం ఈడ్చుకెళ్లాడు. ఈ ప్రమాదంలో రమేష్‌కు తృటిలో ప్రమాదం తప్పింది .పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాఫిక్ ఎస్ఐ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పోలీసులపై రోజురోజుకు ఇలాంటి వికృత చర్యలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులపైనే ఇలా చేయడం సరైనది కాదని నెటిజన్లు సోషల్ మీడియాలో వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వాహనాల తనిఖీలకు సహకరించాలని పలువురు కోరుతున్నారు. హోంగార్డుని చూసి కూడా అతనిపైకి దూసుకెళ్లడం దారుణమని, కనీసం వారి పట్ల మానవత్వం చూపించరా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## వంశీ సంస్థల నిర్వహణలో 52 కథా రచయితలకు సత్కారం

**చిక్కడపల్లి, నవంబరు 8 (ప్రభాతవార్త):** చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 12న వంశీ ఇంటర్నేషనల్ ఇండియా సంస్థల నిర్వహణలో 52 కథా రచయితలను సత్కరించే కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఆ సంస్థల నిర్వాహకులు కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, డాక్టర్ తెన్నేటి సుధా వి వివరించారు. 52 మంది రాసిన కొత్త కథలు ఆరవ భాగం ఆవిష్కరణ సభలో రచయితలను సత్కరించబోతున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ పాల్గొని సంపుటిని ఆవిష్కరిస్తారని, సభకు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారని, అతిథులుగా పలువు మహిళా విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య సూర్య ధనంజయ్, తెలుగు విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య నిత్యానందరావు, నాట్యగురువు ప్రసన్న రాణి, జర్నలిస్ట్ మా శర్మ, దర్శకుడు రేలంగి నర్సింహారావు తదితరులు పాల్గొంటారన్నారు. కొత్త కథలు సంపుటిని లాంఛనంగా డాక్టర్ ఆళ్ళ శ్రీనివాస్‌రెడ్డి(అమెరికా)కు అంకితమిస్తారన్నారు. కార్యక్రమంలో తొలుత అలనాటి నటీ జమున సంస్మరణలో గాయనీ ఆకునూరి శారద (అమెరికా) సహ గాయకులు రామకృష్ణ, సాయి మేఘన, తుషార నిలయ తదితరులచే జమున నటించిన సినిమా పాటల విభావరి ఉంటుందన్నారు.

## స్కిల్ యూనివర్సిటీలో ..లెదర్ డెవలప్‌మెంట్ కోర్స్ పెట్టాలి

**-చెప్పులు,బూట్ల తయారీలో మాదిగలకు శిక్షణ ఇవ్వాలి**

**-దేవని సతీష్ మాదిగ**

**హైదరాబాద్, నవంబర్ 8,ప్రభాతవార్త:**
మా మాదిగల కుల వృత్తిలో మరింత నైపుణ్యం సాధించేందుకు స్కిల్‌డెవలెప్‌మెంట్ యూనివర్సిటీ లో లెదర్ డెవలప్‌మెంట్ కోర్స్ పెట్టి మాదిగలకే సీట్లు ఇవ్వాలని, ఫ్యాషన్ డేవలప్‌మెంట్ లో చెప్పులు, బూట్లు తయారీ, తోళ్ల పనిముట్లలో ప్రవీణ్యత కల్పించి మాదిగల ఇండ్లలో ప్రతి వ్యక్తికి లెదర్ డేవలప్‌మెంట్ లో నైపుణ్యత పెంచాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ అన్నారు. ఈమేరకు శుక్రవారం మాదిగల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సిఎం జన్మదినం సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రక్త దానం శిబిరం నిర్వహించారు. దీనికి మాదిగలు పెద్దఎత్తున హాజరై రక్తదానం చేశారు. ఈసందర్భంగా సతీష్ మాదిగ మాట్లాడుతూ చెప్పులు బూట్లు వేసుకున్న కాళ్ళు ప్రపంచం లో ముందడుగు వేస్తున్నా. తెలంగాణాలో చెప్పులు కుట్టే మాదిగలు ఆర్ధికంగా అభివృద్ధి కి నోచుకోక ఆమడ దూరంలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ గచ్చిబౌలి లో 42 ఎకరాలలో లెదర్ డేవలప్‌మెంట్ లిడ్‌కాప్ కంపెనీ ఏర్పాటు చేశారని అదే విధంగా ఉమ్మడి జిల్లాలు మహబూబ్ నగర్ జిల్లా లో పోలేపల్లి సెజ్ లో 25 ఎకరాలు, అచ్చంపేట లో 25 ఎకరాలు, స్టేషన్ ఘనపూర్ లో 25 ఎకరాలు,ఖమ్మం జిల్లాలోని కారపల్లి 25, మదిపల్లి లో 25, మధిరలో 25, మరియు నల్లగొండ జిల్లాలో దంగపల్లి 25 ఎకరాలు, సిద్దిపేటలో 25 ఎకరాలు ఉంటే కలెక్టర్ కార్యాలయం కట్టారు 5 ఎకరాలు మిగిలింది. నిజామాబాద్ జిల్లాలో రుక్యాపూర్ లో 35 ఎకరాలు, ఆదిలాబాద్ జిల్లాలో మందమర్రి లో 25 ఎకరాలు, కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట లో 25 ఎకరాలు, చొప్పదండి లో 100 ఎకరాలు, ఇందులో 60 ఎకరాల వేరే శాఖలకు కేటాయించారు. ఈ భూములపై లిడ్ క్యాప్ కంపెనీలు 20 ఏండ్లనుండి మూతపడి యంత్రాలు జంగు పట్టి ఎందుకు పనికి రాకుండా పోయినాయి. కావున సిఎం రేవంత్‌రెడ్డి ఈభూముల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా మాదిగ చర్మకారులసంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

## అధికారంలో ఉన్నా లేకున్నా నాయకులకు బిఆర్ఎస్ అండ : కెటిఆర్



మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కెటిఆర్

**చిక్కడపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త:**
అధికారంలో ఉన్నా లేకపోయినా కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండే పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని ఆ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లో స్థానిక మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్‌ను పరామర్శించారు. జవహర్‌నగర్‌లో సిద్దంశెట్టి అపార్టమెంట్‌లో నివాసముంటున్న మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్‌కు శస్త్ర చికిత్స జరిగిన విషయాన్ని తెలుసుకుని ఆమె యోగక్షేమాలు తెలుసుకునేందుకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, బిఆర్ఎస్ యువనేత ముఠాజయసింహా, ముఠానరేశ్ తదితరులున్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న నార్త్‌జోన్ ఏసీపీ

**బేగంపేట నవంబరు 8,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పై అవగాహన కల్గి ఉండాలని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు. శుక్రవారం బాలంరాయి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ సెంటర్ లోని హీరో మోటార్స్ లో రోడ్డు ప్రమాదాలు నివారణ అనే అంశంపై విద్యార్థుల కు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదన్నారు.అలా చేసినట్లైతే తల్లి దండ్రులకు,మరియూ వాహన యజమానికి జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.మరియూ రూ 25000లు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.రహదారులపై విద్యార్థులు నడిచే సమయం లో రెడ్ సిగ్నల్ పడినపుడు జీబ్రా లైన్ల వద్దే రోడ్డు దాటాలన్నారు.ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్గి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు.కార్యక్రమంలో 70మంది విద్యార్థులు స్కూల్ ఇంచార్జి అరుణకుమారి,హీరో మోటార్ కాప్ సాదిక్ ,శ్రవణ్,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## వైభవంగా ఛాత్ పూజ కార్యక్రమం



చాట్ పూజలో పాల్గొన్న రాష్ట్ర బిజెపి నాయకులు అడికె రాజు

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 8 ప్రభాతవార్త :**
మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ఉత్తర భారత సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా చాట్ పూజ కార్యక్రమం జరిగింది.ఈ పూజ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకులు అడికె రాజుతో పాటు కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

# పిఆర్సీ అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్టియూటిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సందానంద్‌గౌడ్

**-ఎస్టియూటిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సందానంద్‌గౌడ్**

**ఆమనగల్లు, నవంబరు 08, ప్రభాతవార్త:** ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావలసిన రెండో పీఆర్సీ అమలులో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయిందని, పీఆర్సి అమలులో తెలంగాణ సర్కారు నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. గత సంవత్సరం జూలైమాసం నుండి పీఆర్సీ అమలుకు నోచుకోవడంలేదని, ఉపాధ్యాయులు పీఆర్సీ కోసం సుధీర్ఘకాలంగా వేచి చూడవలసి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని సంఘ భవనంలో శుక్రవారం స్థానిక ఎస్టీయూటీఎఫ్ అధ్యక్షుడు కసిరెడ్డి అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి వివిధ ప్రాంతాలకు చెందిన ఎస్టియూటిఎస్ సంఘప్రతినిధులు, స్థానిక ప్రతినిధులు హాజరైనారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీయూటీఎస్ ఏడు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతూ ఎన్నో సమస్యలకు పరిష్కారించిందన్నారు. విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కారం కోసం ఎస్టీయూటీఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వాటి పరిష్కార మార్గాల అన్వేషణలో నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా గుర్తించి వారి సొంత జిల్లాలకు కేటాయించి వెంటనే బదిలీలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసి వెంటనే అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్యం అందేలా ఆరోగ్యకార్డులు మంజూరు చేయాలని సందనందంగౌడ్ కోరారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరంటు సరఫరా చేయడాన్ని ఎస్టీయూటీఎస్ స్వాగతిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యతనివ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పోల్‌రెడ్డి, రవి,రామసుబ్బారావు, భూపాల్, కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పరమేశ్వర్, ప్రవీణ్‌కుమార్, పాండు, సుధాకర్, బాలనర్సింహ్మాలు, జిల్లెల సుదర్శన్‌రెడ్డి, ఇఫ్తాకర్, కసిరెడ్డి అశోక్‌రెడ్డి, నవీన్‌కుమార్, సుర్వి విఘ్నేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీడు భూములుగా మారిన పంట పొలాలు

**మర్పల్లి, నవంబరు 8 ప్రభాతవార్త :** రియల్‌ఎస్టేట్ వ్యాపారం రోజు రోజుకు పెరిగిపోవడంతో గ్రామీణప్రాంతాల్లో భూములు అమ్ముడు పోవడంతో నాడు పచ్చని పంటతో కళకళలాడిన పంట పొలాలు నేడు బీడు భూములుగా మారాయి.రియల్ ఎస్టేట్ వ్యాపారం నగరం నుండి గ్రామీణ ప్రాంతాలవరకు పాకడంతో భూముల ధరలు చుక్కలను తాకాయి.భూముల ధరలు పెరిగి పోవడంతో అవసమున్నరైతులు భూములను అమ్ముకోవడం, డబ్బులున్న నాయకులు, వ్యాపారవేత్తలు, పోటీపడి భూములను కొనడంతో భూములకు డిమాండ్ పెరిగి పోయింది.

గ్రామాల్లో నిజమైన రైతు గుంట భూమి కొనలేడు రైతులకు భూములు దూరమవ్వడంతో రైతులు కూలీలుగా మారుతున్నారు. ధనికులు భూములు కొనివాటికి కంచలు వేసి వదిలేయడంతో మర్పల్లి, మొమిన్‌పేట్, పలు మండలాల్లో 25 శాతం భూములు బీడు భూములుగా మారాయి.రోజు రోజుకు పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు,రైతులు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారు.పుడమి తల్లిని నమ్ముకొని వ్యవసాయం చేస్తు పదిమందికి పెట్టె రైతుల నుండి భూములు ధనికులు వ్యాపారవేత్తల చేతుల్లోకి వెళ్లడంతో వ్యవసాయం తగ్గిపోయి పంట దిగుబడి తగ్గిపోవడంతో ముందు ముందు



మర్పల్లి గ్రామీణ ప్రాంతంలో బీడు భూములుగా మారిన పోలం

బువ్వదొరకని దుస్థితి ఏర్పడుతుందని పలువురు అంటున్నారు. వ్యవసాయ రంగాన్ని నమ్ముకొని అప్పుల్లో కూరుకుపోయిన రైతులు అవసరాలకోసం భూములు అమ్ముకొంటున్నారు. రియల్‌ఎస్టేట్‌వ్యాపారులు భూములు కొని తిరిగి అధిక ధరలకు అమ్మడంతో సామాన్యుడు ఇక భూమి కొనలేనిస్థితి మరి.

## వామ్మో ఇది మిక్చర్ కాదు.. ప్రాణాలు తీసే ఖార,బూందీ..!


**ఉప్పల్ ఎవిడి మిక్చర్ కంపెనీపై దాడులు - రూ.13లక్షల పదార్ధాలు సీజ్**



ఉప్పల్ శాంతినగర్‌లోని ఎవిడి మిక్చర్ కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి కావ్య తదితరులు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** ఉప్పల్ శాంతినగర్‌లోని ఎవిడి స్వీట్స్, ఖారా కంపెనీలో శుక్రవారం జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించి కుళ్లిన ఆహార పదార్ధాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ శాంతినగర్‌లో గత కొద్ది సంవత్సరాలుగా నాసిరకం పదార్ధాలతో ఖార, బూంది, స్వీట్లు తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. కంపెనీలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా అపరిశుభ్రత వాతావరణంలో కుళ్లిన ఆహార పద్దారాలు తయారు చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ అధికారి కావ్య ఆధ్వర్యంలోని అధికారుల బృందం కంపెనీలో తనిఖీలు చేసి అపరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్ధాలు తయారు చేస్తున్నారని నిర్ధారించారు. ఆహార పద్ధారాల తయారీ, గడువు తేది లేకుండా ప్యాకింగ్ చేస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. కంపెనీలో ఆహార పదార్ధాలు తయారు చేసే విధానం సరిగ్గా లేదని, బొద్దింకలు, కుళ్లిన పదార్ధాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎవిడి కంపెనీకి నోటీసులు జారీ చేసి దీనిని మూసి వేస్తామని అధికారులు తెలిపారు. కంపెనీలో రూ.13లక్షల విలువైన సుమారు 5532 కిలోల ఆహర పదార్ధాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిని సీజ్ చేసి ఉన్నతాధికారులకు రిపోర్టు అందజేస్తామని తెలిపారు. ప్రజలు ఇటువంటి ఆహర పదార్ధాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. కంపెనీ నిర్వహకుడిపై కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు.

## పోచమ్మ దేవాలయం ముఖద్వారం ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెశిడెంట్ క్యామ మల్లేష్,శ్రీ పోచమ్మ దేవాలయం కమిటి ప్రతినిధులు

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 8 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి బాబుల్‌రెడ్డి నగర్‌లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో నూతనంగా నిర్మించిన దేవాలయం ముఖ ద్వారాన్ని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెశిడెంట్,బిఆర్ఎస్ భవనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంఛార్జి క్యామ మల్లేష్ ప్రారంభించారు.దాదాపు తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో బాబుల్‌రెడ్డి నగర్ కాలనీకి చెందిన కురవ కులస్థులు దేవాలయం ముఖ ద్వారాన్ని నిర్మించారు.ఈ సందర్భంగా క్యామ మల్లేష్ మాట్లాడుతూ దేవాలయం అభివృద్ది కోసం కృషి చేస్తున్న కురుమ సోదరులని అభినందించారు.దేవాలయం ముఖద్వారం నిర్మాణానికి సహకరించిన దాతలకు క్యామ మల్లేష్ మెమోంటోలను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెంకటేష్ కురుమ,అడికె అర్జున్ కురుమ,వెంకటేష్ స్వామి కురుమ,మల్లేష్ కురుమ గురుస్వామి,శ్రీనివాస్ గుప్తా,ఉమ్మడి దేవాలయాల కమిటి అధ్యక్షులు ఉప్పల్‌శ్రీను కురుమ,శ్రీ పోచమ్మ దేవాలయం కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## గగన్ పహాడ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 8 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పద్మశాలి పురం విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటలు నుంచి 11030 గంటలు వరకు పారిశ్రామిక వాడ,మధుబన్ కాలనీ,పద్మశాలిపురం,టిఎన్‌జిఓస్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.రామ్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో 11 నుంచి 12 గంటలు వరకు జల్‌పల్లి పారిశ్రామిక వాడ,శివాజీనగర్,జీవి శివాజీ నగర్ బస్తీలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు రవీందర్ తెలియజేశారు.

## డిసెంబర్‌లో 'చలో ఢిల్లీ' పేరిట పార్లమెంట్ ముట్టడి

**- తెలుగు రాష్ట్రాల కోర్ కమిటీ సమావేశంలో ఆర్.కృష్ణయ్య**

**సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరులో వేలాది మందితో 'చలో ఢిల్లీ' పేరిట భారీగా ప్రదర్శన, పార్లమెంట్ ముట్టడి చేపడతామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బిసిలు హాజరవుతారని ఆయన చెప్పారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ కోర్ కమిటీ సమావేశానికి సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షురాలు నూకాలమ్మ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించాలని, అలాగే జడ్జిల నియామకాలలో రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారంలో బిసిలకు వాటా కల్పించకుండా పాలకులు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అగ్రకులాలకు ఒకే రోజులో ఆఘ మేఘాల మీద 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కల్పించారని, కాని బిసిలకు చట్ట సభలలో రిజర్వేషన్‌లు కల్పించాలని మూడు దశాబ్దాలకు పైగా పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బిసిలకు చట్టసభలలో రిజర్వేషన్‌లు కల్పించాలని నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సిఎం ఎన్.చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో హాస్టల్ విద్యార్థులకు పెంచిన విధంగా ఎపిలో విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని, కళాశాల విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని, కేంద్రం బడ్జెట్‌లో బిసిలకు 2 లక్షల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సి.రాజేం దర్, జిల్లపల్లి అంజీ, వేముల రామకృష్ణ, ఎపి నాయకులు వరప్రసాద్, ప్రసన్న, గురుమూర్తి, చక్రధర్, లక్ష్మణరావు, మద్దిలేటి, సి.హెచ్. శ్రీనివాసులు, శ్రీవాణి, లీలా, జిల్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, నవంబర్ 8, ప్రభాతవార్త :** 33/11కేవీ ప్రశాంతి హిల్స్ సబ్‌స్టేషన్ నుండి వెలువడే 11కేవీ మిథిలానగర్ ఫీడర్‌లో నేడు ఉదయం 11.30 గంటల నుండి 12 గంటల వరకు మిథిలానగర్ సర్కిల్, ఆర్‌కె లేఅవుట్ ప్రాంతం, బ్లూమ్స్ స్కూల్ ఏరియా, వెంకటేశ్వర దేవాలయం, 11కేవీ ఆర్‌జికె ఫీడర్‌లో ఉదయం 11.30 గంటల నుండి 12 గంటల వరకు వాసవీ లేఅవుట్, ఆర్‌జికె రోడ్, సాయిలక్ష్మీ లేఅవుట్, న్యూ విజేత సూపర్ మార్కెట్ అలాగే ఉదయం 11 గంటల నుండి 1.30 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 గంటల వరకు బౌరంపేట్ సబ్‌స్టేషన్ 11కేవీ జున్నూరం ఫీడర్‌లో సాయికృష్ణ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రుద్ర విల్లాస్, మనం ఫార్మసీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతి నగర్ ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.

**మైటాస్ సబ్ స్టేషన్ పరిధిలో..**

33/11కేవీ మైటాస్ సబ్ స్టేషన్, 11కేవీ వెంకటసాయి ఫీడర్‌లో నేడు ఉదయం 11 గంటల నుండి 2గంటల వరకు రామవద్ర ఎన్‌క్లేవ్, నిజాంపేట్ గ్రామం, వెంకటసాయి కాలనీ, వెర్టెక్స్ లేక్ వ్యూ, శ్రీరామ్ స్కూల్, పుష్పక్ అపార్ట్‌మెంట్, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు 11కేవీ కెఎన్‌ఆర్ ఫీడర్‌లో గాయత్రి టవర్స్, సంతోషిమాత ఆలయ ప్రాంతం, విజ్ఞాన స్కూల్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉందని నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

**దుండిగల్ పరిధిలో...**

విద్యుత్‌లైన్ల మరమ్మత్తుల్లో భాగంగా బహాదూర్‌పల్లి, భౌరంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం(09-11-2024) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహాదూర్‌పల్లి సబ్‌స్టేషన్ 11కెవి కోకాకోలా ఫీడర్ పరిధిలోని డాలర్‌డ్రీమ్స్, సింహాపురికాలనీ, గోకుల్‌బృందావనం, ఎస్‌బిఐకాలనీ, డిఆర్‌కె ఇంజినీరింగ్ కళాశాల, మైస్పెస్ అపార్ట్‌మెంట్స్, కెఎల్ యూనివర్సిటీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11:30గంల నుండి మధ్యాహ్నం 1:30గంల వరకు, మధ్యాహ్నం 2:30గంల నుండి 4:30గంల వరకు, భౌరంపేట సబ్‌స్టేషన్ 11కెవి కెవిఆర్, విలేజ్ ఫీడర్ల పరిధిలోని కెవిఆర్‌కాలనీ, స్ప్రింగ్‌వుడ్, జెఎన్‌ఎస్‌విల్లాస్, స్టెర్లింగ్‌హోమ్స్, ప్రణీత్ నేచర్‌బౌంటీ, భౌరంపేట గ్రామం, ల్యాండ్‌మార్క్2, కీర్తిహోమ్స్, అక్షయ్‌డెవలపర్స్, ప్రణీత్ బ్లూమ్స్, మెడోస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30గంల నుండి 2:00గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించవల్సిందిగా ఏఈ కోరారు.

## క్రషర్ మిషన్‌కు అనుమతులు ఇవ్వద్దు

**జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 08,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామశీవారులో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న క్రషర్ మిషన్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వరాదని మండలంలోని వీరన్నపేట గ్రామస్తులు తహసీల్దారుకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. సర్వే నెంబర్ 185లో క్రషర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వారు పెర్కొన్నారు. క్రషర్ మిషన్ ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గల వ్యవసాయ సాయ పొలాలో వాయు కాలుష్య ఏర్పడి పంటలు నాషనం అవుతాయని తెలిపారు. అధికారులుస్పందించి క్రషర్ మిషన్ ఏర్పాటును ఆపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్, యాదగిరి, గౌస్, సుధాకర్, శేఖర్, అంజి . కృష్ణ తదితరులు ఉన్నారు.

## సర్వేను పరిశీలించిన ప్రత్యేక అధికారి



వనం పల్లిలో సర్వేను సరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వెంక్యానాయక్

**జిల్లెడు చౌదరిగూడ, నవంబరు 08,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతీష్టాత్మకంగ చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి వెంక్యానాయక్ పరిశీలించారు. మండలంలోని వనంపల్లి గ్రామంలోఇన్యూమూనేటర్‌లు గ్రామంలో ఇంటింటికి స్టిక్కర్లు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గ్రామంలో చేస్తున్న సర్వే వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఇంటిని సర్వే తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఏవైన సందేహాలు ఉంటే ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన పెర్కొన్నారు. ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, ఎంపిఓ హన్మంత్‌రెడ్డి ఉన్నారు.

## రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

**ఎడిఓ ఆదిలక్ష్మి**



**ఆమనగల్లు,నవంబర్08, ప్రభాతవార్త:** రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సాగులో అవలంబించవలసిన పద్దతులు, సలహాలు, సూచనలు నిరంతరం వ్యవసాయాధికారులు అందిస్తున్నట్లు ఆమనగల్లు డివిజన్ సహాయ వ్యవసాయాధికారిణి డి. ఆదిలక్ష్మి తెలిపారు. రైతులు సాగులో ఎదుర్కుంటున్న సంకోచాలను నివృత్తి చేసుకుని వ్యవసాయాధికారుల సూచనలతో అధిక దిగుబడులు పొందాలని ఆమె సూచించారు. శుక్రవారం ఆమనగల్లు మండల పరిధిలోని పోలెపల్లి గ్రామానికి చెందిన శ్రీ అభిషేక్ కాటన్ మిల్లు శుక్రవారం స్థానిక ఏఓ శ్రీనివాస్‌గౌడ్, సీసీఐ లక్ష్మణరావుతో కలిసి ఏడీఓ సందర్శించి పత్తి కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. మిల్లు నిర్వహకులతో మాట్లాడి పత్తి కొనుగోలులో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తూకాలలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలను ఎప్పటికప్పుడూ సరి చూసుకోవాలన్నారు. అలాగే పత్తిరైతులు 8-12 తేమశాతం మధ్య ఉండే పత్తిని మాత్రమే మిల్లులో అమ్ముకోవడానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మిల్లునిర్వహకులు, రైతులు ఉన్నారు.

## సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి : డిసి



**అత్తాపూర్ నవంబరు8,ప్రభాతవార్త :**
ఎలాంటి అపోహలు చెందకుండా సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజేంద్రనగర్‌లో అధికారులు చేపడుతున్న సర్వేను డిసి రవి కుమార్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ....సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి సహకరించి తమ వివరాలను తెలపాలని సూచించారు.అధికారులు పకడ్బందీగా వివరాలను నమోదు చేయాలని ప్రజలకు అర్థమయ్యే విధంగా అన్ని వివరించి సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులుకల్గకుండా ధాన్యం సేకరించాలి

**ఘట్‌కేసర్, నవంబరు 8, ప్రభాతవార్త:** రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలుచేయాలని రాష్ట్ర విజిలెన్స్ ఎస్‌పీ శశిధర్‌రాజు తెలి పారు.ఘట్‌కేసర్‌మున్సిపాలిటీపరిధిలోని మాదారం, ఎదులా బాద్ లలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర విజిలెన్స్ బృందం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో రికార్డు లను తనిఖీ చేసి ధాన్యం తూకాన్ని పరిశీలించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుంగా అన్ని వసతులు కల్పించాలని, ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించి సకాలంలో బిల్లులు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచిం చారు. విజిలెన్స్ ఎస్‌పీ శశిధర్‌రాజు, డిఎం సుగుణబాయి, డిసిఓ వెంకట్‌రెడ్డిలు ధాన్యం తనిఖీచేసిసేకరణ తీరును పరిశీలించారు. ఘట్‌కేసర్ ఏఈఓ జగదీష్, కేంద్రాల ఇంచార్జ్‌లుచెన్నయ్య, ప్రవీణ్ ఉన్నారు.

## కుటుంబ సర్వేను పరిశీలించిన మండల అధికారి

**దోమ,నవంబరు 8 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రత్యేక అమలు చేస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటిసర్వేను సక్రమంగా సర్వే చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అదికారి మహేశ్‌బాబు అన్నారు.శుక్రవారం నాడు దోమ మండలపరిధిలోని కేసులమ్మతాండా, మైలారం, గొడుగోనిపల్లి గ్రామాలలో ప్రాథమిక పాఠశాల ఉధ్యాయులు,పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సర్వేను పరిశీలించారు.ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ సామాజిక ,ఆర్థిక, విద్య,ఉపాది, రాజకీయంతో పాటు కులగణన,ఇండ్ల పరిశీలన చేసి,ఇండ్లను గుర్తించి ఇండ్లకు స్టిక్కర్ వేయాలని తెలిపారు.ఎన్యురేటర్‌గా 94 మంది ఉపాధ్యాయులతో 36 గ్రామ పంచాయతీల్లో 11659 ఇండ్లకు స్టిక్కర్‌లు వేసిఇండ్ల వివరాలు సేకరించడము జరిగిందని అన్నారు.. ముందుగా మండలములోని గూడుర్,కేసులమ్మ తాండాలోని పాఠశాలలను పరిశీలించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనంను, విద్యార్థుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో యంపివో సోమలింగం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడిసిబ్బంది, పాల్గోన్నారు.

## టీచర్ల యూనియన్ మండల మహాసభలు..



మండల మహాసభలు

**నిజాంపేట్, నవంబర్ 8, ప్రభాతవార్త**
టిఎస్‌యూటిఎఫ్ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు ఎస్.పురుషోత్తం అధ్యక్షతన శుక్రవారం మండల మహాసభలు నిర్వహించారు. ఈ సమావవేశంలో విఒటిటి ప్రధాన సంపాదకులు పాపన్న గారి మాణిక్‌రెడ్డి మాట్లాడుతూ క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ ఈహెచ్ఎస్ కార్డు ద్వారా ఉపాధ్యాయులందరికీ అందించాలని, పెండిగ్ 4 డీఏలను, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కె.జయసింహారెడ్డి, జెడ్‌పిహెచ్ఎస్ కుత్బుల్లాపూర్ జిహెచ్‌ఎం కమల్‌సింగ్, టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గొడుగు శ్రీనివాస్, టిఎస్‌యూటిఎఫ్ మండల కార్యకర్తలందరూ, ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో (2024-25) టిఎస్‌యూటిఎఫ్ కుత్బుల్లాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎస్. అధ్యక్షులుగా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా కె.కుమారస్వామి, మహిళా ఉపాధ్యక్షులుగా ఎ.వసంత, ఉపాధ్యక్షులుగా కె.సుధాకర్, కోశాధికరిగా ఎస్.నరసింహులు, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా ఎమ్ సంతోష్‌ని ఎన్నుకున్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : కోలన్ హన్మత్‌రెడ్డి


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కోలన్ హన్మత్‌రెడ్డి

**నిజాంపేట్, నవంబర్ 8, ప్రభాతవార్త**
సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ.60,000 సీఎం సహాయనిధి నుండి సిఎం సహాయనిధి నుండి మంజూరు చేయించిన పత్రాలను శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కోలన్ హన్మత్‌రెడ్డి మంజూరయిన పత్రాలను బాధిత కుటుంలు మల్లంపేట్ దుండిగల్ మున్సిపాలిటీ, 125,129 డివిజన్లకు చెందిన వాసులు యేసుదాస్ డేవిడ్, నర్సింహా, ప్రసాద్, పద్మినిలకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్‌కుమార్, డా.అవిజె జేమ్స్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్‌రెడ్డి, డివిజన్ నాయకులు లాయక్, గణేష్, పెరికె శివ, పండరి, సోమన్నగారి శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణ, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లోనూ యువత ప్రపంచంతో పోటీ పడాలి : ఎమ్మెల్యే వివేకానంద


క్రీడా జ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే వివేకానంద

**కొంపల్లి, నవంబర్ 8, ప్రభాతవార్త**
కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని ఇగ్నైట్ ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నర్విహించిన కేలో ఇగ్నైట్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత చదువులతో పాటు క్రీడలోన్ల సత్తా చాటుతూ ప్రపంచంతో పోటీ పడాలని అన్నారు. గత ఐదేళ్ల క్రితం 150మందితో ప్రారంభమైన ఇగ్నైట్ ఐఎఎస్ అకాడమీ నేడు 500మంది విద్యార్థులతో మంచి విద్యను అందిస్తూ ఎందరో విద్యార్థులను ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేస్తున్న ఇగ్నైట్ ఐఎఎస్ అకాడమీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు పూజారి వసంత, లక్ష్మన్, డప్పు కిరణ్, కోఆప్షన్ సభ్యులు వెంకటేష్, ఇగ్నైట్ ఐఎఎస్ అకాడమీ చైర్మన్ సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ ఎన్.ఎస్.రెడ్డి, సివిల్స్ డీన్ ఎన్.అనుష్‌రెడ్డి, డైరెక్టర్ వి.పవన్ కుమార్, ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలోని గౌలిపుర,లలితాబాగ్ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

**చార్మినార్,నవంబరు 8 ప్రభాతవార్త :**
పాతబస్తీలోని గౌలిపుర,లలితాబాగ్,అరుంధతీ నగర్ కాలనీ బస్తీలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం యాదవ్ ఫలక్‌నుమా డిపో మేనేజర్ రమేష్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు.గౌలిపుర నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్‌కు బస్సును నడిపించాలని ముత్యం యాదవ్ మేనేజర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.లలితాబాగ్,అరుంధతీకాలనీ ప్రాంతాలకుబస్సులు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని,రాత్రి వేళల్లో నానా అవస్థలు పడుతున్నారని,ఈ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఆయన డిపో మేనేజర్‌ను కోరారు.పాతబస్తీకి బస్సుల సౌకర్యాన్ని కల్పిస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారని ముత్యం యాదవ్ తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్,నవంబరు 8 ప్రభాతవార్త :**
విద్యుత్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు వరకు నలందనగర్ ,వెంకటేశ్వర ఎన్‌క్లేవ్,డాక్టర్ కాలనీ,సిరిమల్లె నగర్,లోటాస్ స్కూల్, ప్లీశాంత్ పార్కు,న్యూఫ్రెండ్స్ కాలనీ,లక్ష్మీ నగర్ ప్రాంతాలలో,సంజీవిని హిల్స్,నలందనగర్,సిరిమల్లెనగర్,ఏజి కాలనీ బస్తీలలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలు నుంచి 4 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు తెలిపారు.చందూలాల్ బారాదరి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటలు నుంచి సాయంత్రం నాలుగున్నర గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

## ఛత్ పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, నవంబర్ 8, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్ ఎన్‌టిఆర్ నగర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ఛట్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, చండీగఢ్, గుజరాత్, గయ, రాంచీ, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాల్లో ప్రముఖంగా కార్తీకమాసంలో ఛట్ పూజలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఛట్ పూజను దళఛట్, ఛతి, సూర్య షష్ఠి అని కూడా అంటారని తెలిపారు. మన ప్రాచీన పండుగల్లో ఛట్ పూజ ఒకటని, భూమ్మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఆయురారోగ్య, ఆనందాలను ప్రసాదించమని ప్రార్థిస్తారన్నారు. సూర్యని ఆరాధించడంవల్ల కుష్టువంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమౌతాయని, పవిత్రనదిలో పుణ్యస్నానం చేసి నీటిలో వీలైనంత ఎక్కువసేపు నిలబడి సూర్యభగవానుని ఆరాధిస్తారని తెలిపారు. దీపాలు వెలిగించి, పండ్లు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

ఫలాలు ప్రసాదంగా సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగరాజ్ యాదవ్, 191 ఎన్‌టిఆర్ కాలనీ ఛట్ పూజ నిర్వాహకులు రాజేష్, జితేంద్ర, శంభు, ఓం ప్రకాష్, 191 ఎన్‌టిఆర్ ప్రెసిడెంట్ కృష్ణ, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, మధు, నర్సింహా నాయక్, శేఖర్ చిన్ను, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబర్‌పేట్ వికలాంగుల సంఘం నూతన కమిటీని అభినందించిన ఎమ్మెల్యే


అంబర్‌పేట్ వికలాంగుల సంఘం నూతన కమిటీ నాయకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త:** అంబర్‌పేట్ వికలాంగుల సంఘం నూతన కమిటీ నాయకులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అభినందించారు. శుక్రవారం గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ఎం.భిక్షపతి, డి.బాబూరావు, మహిళా అధ్యక్షురాలు సరితలను ఎమ్మెల్యే సత్కరించి, అభినందనలు తెలియచేశారు.

## టీచర్లకు, విద్యార్థులకు దుస్తులు పంపిణీ


బోయిన్‌పల్లిలో టీచర్లకు, విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 8 ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లిలోని గ్రామర్ హై స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు, టీచర్లకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ ఆధ్వర్యంలో విద్యార్లులకు,టీచర్లుకు, నర్సులకు దుస్తులు అందజేశారు.

## దక్షిణ మధ్య రైల్వేలో ఆర్‌ఎంయూను గెలిపించాలి : ప్రభుచరణ్


రైల్వేలో రైల్ మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న ప్రభుచరణ్ తదితరులు


**కంటోన్మెంట్,నవంబర్ 8 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో రైల్ మజ్దూర్ యూనియన్ (ఆర్.ఎం.యూ)ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆర్.ఎం.యూ.ప్రధాన కార్యదర్శి ప్రభుచరణ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్ నిలయం, సంచాలన్ భవన్, హైదరాబాద్ భవన్, లేఖ భవన్‌లలో విధులు నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులను కలిసి ఆర్.ఎం.యూను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## సెపక్ తక్ర క్రీడను 'ఖేలో ఇండియా'లో చేర్చాలి

**-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి పెరిక సురేష్ వినతి**



**హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త**
సెపక్ తక్ర క్రీడను కేలో ఇండియాలో చేర్చి గ్రామీణ స్థాయి యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు కృషి చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెరిక సురేష్ అన్నారు. శుక్రవారం ఈ మేరకు పెరిక సురేష్ కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ప్రధాని నరేంద్రమోడీ ఏర్పాటు చేసిన కేలో ఇండియా దేశంలో ఎంతో మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దుతోందని చెప్పారు. సెపక్ తక్రాను కేలో ఇండియాలో చేర్చడంతో పాటు రాష్ట్రంలో కేలో ఇండియా స్టేట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్(కెఐఎస్‌సీఈ), కేలో ఇండియా అక్రిడేటెడ్ అకాడమిలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఫలితంగా తెలంగాణలో సెపక్ తక్రా క్రీడాభివృద్ధికి తోహదపడుతుందని కిషన్‌రెడ్డిని అభ్యర్థించారు. మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తరువాత ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నూతన అధ్యక్షుడు పెరిక సురేష్ ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ కుమార్తె వివాహానికి హాజరైన కేటీఆర్, ముఠా గోపాల్, ఎం.ఎన్.శ్రీనివాస్, ముఠా జైసింహ తదితరులు

## పురోహితులకు నిత్యావసర సరుకులు పంపిణీ


కార్ఖానలో మహంకాలి ఛండీ యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్,వేద పండితులు తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 8 ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ఆధ్వర్యంలో 300 మంది పురోహితులతో లక్ష్మి గణపతి యాగం, ఛండీ యాగం,శతరుద్ర యాగం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయాగంలో పాల్గొన్న అచర్చకులకు నిత్యవసర సరుకులు, దుస్తులను ఎమ్మెల్యే శ్రీగణేష్ దక్షిత అందజేసి పురోహితుల ఆశీర్వాదం తీసుకున్నారు. వేద పండితులు హేమంత్ శర్మ ఆధ్వర్యంలో 6 గంటల పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఈ యాగంలో పాల్గొన్న బ్రాహ్మణులకు, 2వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెలుకుంట సతీష్ గుప్త, నాగినేని సరిత, చిరబోయిన సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, సంకి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్ట్ ట్రంప్ విజయం చారిత్రాత్మకం

**ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ పద్మారావు**

**సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** అమెరికా 47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ జె. ట్రంప్ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) హర్షం వ్యక్తం చేసింది. ట్రంప్‌కు ప్రజలు ఇచ్చిన తీర్పు అపూర్వమైనదని, అఖండమైనదని ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి. పద్మారావు పేర్కొన్నారు. రష్యా ఉక్రెయన్, మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధంలో నలిగిపోతున్న ప్రజల దుఃఖం నుంచి విముక్తి పొందడానికి దేశీయ సమస్యలతో పాటు ప్రపంచ ప్రజల, అమెరికన్ ప్రజల ఆశయాలను ట్రంప్ నెరవేరుస్తారని తాము ఆశిస్తున్నామని ఆయన చెప్పారు. దేశవాళీ వాగ్దానాలను నేరవేర్చడంతోపాటు శాంతిని నెలకోల్పేందుకు ట్రంప్ మార్గం సుగమనం చేస్తారని ప్రపంచం ఆసక్తిగా ఎదురు చూస్తున్నదన్నారు. యుఎస్ వైస్-ప్రెసిడెంట్‌గా ఎన్నికైన జె.డి.వాన్స్ యొక్క విజయం కూడా చాలా గొప్పదని పద్మారావు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వాన్స్ ఆంధ్రప్రదేశ్‌లో మూలాలు కలిగియుండి తెలుగు మూలాలను కలిగిన యుఎస్ రెండోవ మహిళాగా మారినందుకు భారతదేశంలోని మనందరికి, ప్రత్యేకంగా ఎపి ప్రజలకు గర్వకారణమన్నారు. భారత ప్రజానీకానికి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన గొప్ప రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను నిర్మించడంలో నిబద్ధత కలిగిన వ్యక్తులు అవిశ్రాంతగా పనిచేస్తున్నందున రిపబ్లికన్ మాదిరిగానే భారతదేశంలో కూడా తమ పార్టీ రాజకీయంగా పుంజుకునేందుకు ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. దేశంలో నిజమైన సామాజిక, లౌకిక, సమాఖ్య, ప్రజాస్వామ్య అంబేద్కర్ రిపబ్లికన్ పార్టీ స్థాపించడానికి అగ్రవర్ణ కార్పోరేట్ దౌర్జన్యాన్ని, దోపడీని అంతం చేయడానికి ఢిల్లీలోని ఎర్రకోటపై ఆర్‌పిఐ ఖచ్చితంగా రిపబ్లికన్ బ్లూ జెండాను ఎగర వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్రమశిక్షణతో శ్రమిస్తే అనుకున్నది సాధిస్తాం


విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ ఐపియస్ అధికారి రాజీవ్ త్రివేది.

**యూసుఫ్‌గూడ, నవంబర్ 8, ప్రభాతవార్త :**
క్రమశిక్షణ, సాహసం, శ్రద్ధతో శ్రమిస్తే అనుకున్నది సాధించగలుగుతామని మాజీ ఐపిఎస్ అధికారి రాజీవ్ త్రివేది అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయ్ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో మధురానగర్‌కు చెందిన విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్‌డేని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాజీవ్ త్రివేది పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకులకు తల్లిదండ్రుల తోడ్పాటు ఎంతైన అవసరం అన్నారు. నేటి చిన్నారులే రేపటి పౌరులని వారిని సరియైన మార్గంలో నడపడం అవసరం అన్నారు. అదేవిధంగా విజ్ఞానజ్యోతి ప్రసిడెంట్ డి.సురేష్‌బాబు ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్‌లతో పాటు విజ్ఞానజ్యోతి చైర్మన్ జి.కృష్ణప్రసాద్, తదితర సభ్యులు పాల్గొనగా స్కూల్ ప్రిన్సిపల్ అరుణ కుమారిలు పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా 2024 సిబియస్‌సి పదవతరగతి వందశాతం పాస్ అవడం గర్వించదగ్గ విషయమని అన్నారు.చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

**-ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటీకాల పురుషోత్తం**

**సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:**
పర్యావరణ సమస్యలపై ఒక దృడమైన సంకల్పంతో ముందుకు వెళ్ళడం అభినందనీయమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటీకాల పురుషోత్తం చెప్పారు. శుక్రవారం మండలి కార్యాలయంలో ఎన్విరాన్మెంట్ యాక్టివిస్ట్ తాజా సంచికను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్విరాన్మెంట్ కౌన్సిల్ సంస్థ పర్యావరణ సమస్యల పట్ల ఒక ఖచ్చితమైన అభిప్రాయంతో ముందుకు పోవడం పర్యావరణం రానున్న రోజుల్లో మరింతగా ఆరోగ్యకరంగా ఉండే అవకాశం అందరి అభిప్రాయమని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసి ముందుకు సాగుతున్నదని, ఇందులో భాగంగానే మూసి నది ప్రక్షాళన, హైడ్రా వ్యవస్థతో చెరువుల సంరక్షణ అని అన్నారు. మూసి నది ప్రక్షాళన హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పఠంలో తొలివరసలో నిలుపుతుందని పురుషోత్తం చెప్పారు. ఈ రెండు కార్యక్ర



సంచికను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఇటీకాల పురుషోత్తం

మాలతో సిఎం రేవంత్‌రెడ్డి దార్శినికత అర్థమవుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంటే వ్యక్తులు, వ్యవస్థ సమిష్టిగా కృషి చేయాల్సిన ప్రక్రియ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్వీరాన్మెంట్ ప్రొటెక్షన్ డవలఫ్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్సీ హెచ్ రంగయ్య, సీనియర్ ప్రాతికేయులు రుద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి సమితి మహాసభకు భారతదేశ ప్రతినిధిగా డాక్టర్ సుధాకర్

**-నేడు నేపాల్ రాజధాని ఖాట్మండ్‌కు పయనం**

**సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:**
నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉన్న వరల్డ్ పీస్ కౌన్సిల్ మహాసభలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు, ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ భారత దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారు. ఈ మేరకు శుక్రవారం అమృత ఏస్టేట్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సుధాకర్‌ను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వరల్డ్ పీస్ కౌన్సిల్ అనేది 100 కంటే ఎక్కువ దేశాలలో ఉన్న అతిపెద్ద అంతర్జాతీయ శాంతి నిర్మాణ సంస్థ అని తెలిపారు. రష్యా ఉక్రెయిన్ మధ్యప్రాచ్యంలో జరుగుతున్న కూర్రమైన యుద్ధాలు, మారణ హోమం నేడు జరుగుతున్న తరుణంలో ఈ మహాసభ నేపాల్‌లో జరగడం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నదన్నారు. దేశాల మధ్య యుద్ధాల నివారణ, ప్రపంచ శాంతి, నిరాయుధీకరణ, ప్రపంచ


డాక్టర్ దిడ్డి సుధాకర్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

భద్రత, స్వాతంత్ర్యం, ఆర్థిక, సామాజిక న్యాయం, అభివృద్ధి, పర్యావరణం, మానవ హక్కులు, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ వంటి అంశాలపై ఈ మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేయడం జరిగుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు ఎంఆర్‌జి వినోద్‌రెడ్డి, డా.తిప్పర్తి యాదయ్య, కె.వి.ఎల్, మెట్ల జగన్, నాయకులు రామరాజు, కె.నగేష్, అంజన్ కుమార్, లింగమూర్తి, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

## దేవాలయ పరిరక్షణ సమితి అంబర్‌పేట అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ నియామకం


విజయ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న యాదగిరి, యమన్సింగ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:**
సనాతన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి అంబర్‌పేట అధ్యక్షుడిగా జై.విజయ్‌కుమార్ నియమితులైనారు. ఈ మేరకు శుక్రవారం జైస్వాల్ గార్డెన్‌లో ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో పరిరక్షణ సమితి ఛైర్మన్ పుట్టి యాదగిరిముదిరాజ్, అధ్యక్షుడు ఠాకూర్ యమన్సింగ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పతాధికారులు, నియోజకవర్గ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని మున్సిపల్ డివిజన్లలో సనాతన హిందూ దేవాలయాల పరిరక్షణకు ఒక కమిటీని వేస్తానని చెప్పారు.

## వ్యాపారులను ఇబ్బదులకు గురి చేయడం సరైంది కాదు : ఎమ్మెల్యే తలసాని


మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట,నవంబర్ 8 ప్రభాతవార్త:** బ్యూటిఫికేషన్ పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మాజీ, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం మాజీ కార్పోరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో అమీర్‌పేట్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమైయ్యారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్, హన్‌మాన్ టెంపుల్, కనకదుర్గమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాలో అనేమంది పేదలు చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారం చేసుకుంటే జీవనం కొనసాగిస్తుండగా జిహెచ్ఎంసి అధికారులు సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరైందికాదన్నారు. దీంతో ఎవరు ఆందోళన చెంద వద్దని సంబంధిత అధికారులతో చర్చించి చిరు వ్యాపారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గుర్మిత్ సింగ్, ఉత్తమ్‌రాజ్, అశోక్, రోహిత్ తదితరులు


తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, SLP జోన్, GHMC
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
**నిట్ నం.35/EE/CIR-20/SLPZ/GHMC/1/2024-25,** **తేది: 07.11.2024**
పని యొక్క కేటగిరీ: ఇతర పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో) 13.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ, చివరి తేదీలు మరియు సమయం: 08.11.2024 సా.04.00 గం., 16.11.2024 మ.01.30 గం. అధికారి పేరు, చిరునామా సెల్ నం.EE, CIR-20, SLPZ, GHMC 9154834248 **సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-20, GHMC**
**DIPR.No.6371-PP/CL/Advt/1/2024-25, తేది: 08.11.2024**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ : మల్కాజ్‌గిరి సర్కిల్-28**
GHMC
**నిట్ నం.37/EE-28/SBZ/GHMC/2024-25, పని పేరు:** నిర్వహణ పనులు, ఇతరములు-20. అంచనా మొత్తం (రూ.లక్షలలో) 282.85. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం, బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 09.11.2024 మరియు ఉ.10.30 గం. 16.11.2024 మరియు ఉ.10.30 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం.: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9154796465. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. **సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.28, GHMC**
**DIPR.No.6388-PP/CL/Advt/1/2024-25, తేది: 08.11.2024**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణ పనులు
**నిట్ నం.25/EE-7(4B)/CRZ/GHMC/2024-25, పని పేరు:** క్ర.సం.1 నుండి 21, అంచనా ధర (రూ.లక్షలలో) రూ.263.60 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు & సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 09.11.2024 మ.02.00 గం. వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేది: 18.11.2024 మ.02.15 గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ జి. ఏకాంబరం, EE, (FAC), సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, మస్కటి గ్రౌండ్, దరాబ్‌జంగ్ కాలనీ, సంతోష్‌నగర్, హైదరాబాద్ ఫోన్ నం.7673951166. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. **సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, GHMC**
**DIPR.No.6420-PP/CL/Advt/1/2024-25, తేది: 08.11.2024**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001**
**O.A. No. 876/2023**
**Summons under sub-section (4) of Section 19 of the Act, read with sub-ule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.**
**Between:**
**Indian Bank, Begumpet Branch .....Applicant**
**And**
**1. Mr. D.V. Phani Kumar, S/o. Sri D.V. Surya Narayana, Aged about 46 years, Occ:Business, R/o.H.No.SRT-165 & SRT-106,Sanathnagar, Hyderabad-500038**
**2. Mr. D.V. Shiva Kumar, S/o. Sri D.V. Surya Narayana, Aged about 50 years, Occ: Business, R/o.H.No.SRT-165 & SRT-106, Sanathnagar, Hyderabad-500038**
**.....Defendants No.1 & 2**
Whereas, O.A. No.876 of 2023 was listed before Hon'ble Registrar on 06-11-2024.
Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for Recovery of debts of **Rs.43,11,399/-** (application along with copies of documents etc., annexed)
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or asset other then properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on **17-12-2024 at 10.30 A.M.** failing which the application shall be heard decided in your absence.
Given under my hand and seal of the tribunal on this the 6th day of November 2024
**Signature of the Authorised Officer to issue Summons.**

**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S. No. 5049 of 2024**
Between:
**1. Smt. Gandhe Sumangali**
**2. Gourisetti Swapna**
**3. Gandhe Sangeetha**
(being mentally disabled Rep. by mother & guardian the 1st Plaintiff)
**4. Gandhe Pallavi ...Plaintiffs**
AND
**1) The Tahsildar,**
Himayat Nagar Mandal,
HYDERABAD
TELANGANA STATE.
**2) All Concerned . ...Defendants**
To
**All Concerned**
Please take notice that the above named Plaintiffs have filed the above said O.S. No. 5049 of 2024 against the Defendants for declaring the Plaintiffs as legal heirs of Late Gandhe Nagaiah who died on **14.07.2023.** If any person(s) having any objection or claim in respect of the above said Suit Claim may appear before the Hon'ble Court on **27.11.2024 at 10:30 A.M** by person or through an Advocate on the above mentioned date and time failing which the matter will be decided according to the law.
(BY ORDER OF THE COURT)
**DWARA PALLAVI**
**ADVOCATE**
Flat No.8, Plot No.170/7,
Road No.24, Madhavi Nilayam,
Vivekananda Nagar, Kukatpally,
HYDERABAD-500 072,
**Ph.No.8885019329**
**COUNSEL FOR PLAINTIFFS**

**IN THE COURT OF HON'BLE II ADDL. DISTRICT AND SESSIONS JUDGE: R.R. DIST. AT: L.B.NAGAR**
**O.S. No. 551 of 2024**
BETWEEN:
**1. Karengula Vijay Kumar** S/o Karengula Yettaiah, Aged 65 years, Occ: Cultivation, R/o H.No. 5-3-397, Weaker Section Colony, Saheb Nagar, Vanasthalipuram, Hyderabad, TS. & others **...Plaintiffs**
AND
**1. All Concerned & another ...Defendants**
To,
**D-1) All Concerned**
Please take notice that the above named Plaintiff has filed a suit to declare them as **Legal Heir of Late Sri Karengula Yettaiah S/o Kataiah,** in respect of below mention properties and the sameis posted to **29-11-2024** for objections. Any person/s having objection may appear before the above named court **at 10.30** on the said date either in person or through an Advocate, failing which the matter will be heard ex-parte and orders will be passed on merits. Hence this notice.
**SCHEDULED PROPERTY**
All that agricultural Patta land classified as Metta/Dry admeasuring Ac. 4.3450 guntas in Sy. No. 255e of Pedda Amberpet (Kalan) Village, Abdullapurmet Mandal, Ranga Reddy District, shown in Dharani Portal vide Khata No. 197, which stands in the name of Sri Karengula Yettaiah S/o Kotaiah.
//BY THE ORDER OF THE COURT//
**Sd/- M. LAXMAN RAO**
**Advocates**
Plot No. 331, Road No.11, Vasavi Colony, SRK Puram, HYDERABAD-500 035, **Cell:9393580009.**

## సమస్యల పరిష్కారానికి కృషి : ఆకుల శ్రీవాణి



అధికారులతో కలిసి పాదయాత్ర చేస్తున్న శ్రీవాణి

**హుడాకాంప్లెక్, నవంబర్ 8 ప్రభాతవార్త:** డివిజన్ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ అకుల శ్రీవాణి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధి లోని లక్ష్మినగర్ కాలనీలో వివిధ విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భగా కాలనీలో నెలకొన్న సమస్యలను స్వయంగా తెలిసికొని త్వరగ పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డి ఇ. చందన, వర్క్ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, ఎస్ ఎఫ్ ఏ నరేష్, రాంకీ సిబ్బంధి భరత్, వెటర్నరి అధికారి యాదగిరి, ఇంజనీరింగ్ అధికారి ఏ ఈ ప్రశాంతి, జలమండలి మేనేజర్ ప్రవీణ్ పాల్గోన్నారు.

## చెస్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ



**తుర్కయంజాల్ నవంబర్ 8(ప్రభాతవార్త)**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ పరిధిలో గల వెంకటేశ్వర కాలనీలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఆటల పోటీలలో పాల్గొని విజయాన్ని సాధించారు.విజయం సాధించిన విద్యార్థులు చెస్ పోటీల్లో కేతన్ రెడ్డి అండర్ 14 మొదటి బహుమతి పొందగా, క్రితిక్ రెడ్డి అండర్ 17 ద్వితీయ బహుమతి సాధించి విజేతలుగా నిలిచారు. వీరిని డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీమతి అరుణ , అభినందించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## పెంచిన మేస్ చార్జీలు వెంటనే అమలు చేయాలి : మహేష్ కుమార్



హనుమకొండ కలెక్టర్కు వినతిపత్రం పత్రం అందజేస్తున్న కూరెళ్ళ మహేష్ కుమార్ తదితరులు

**మలక్ పేట , నవంబర్ 8, ప్రభాతవార్త :** సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు పెంచిన మేస్ చార్జీలు, మెనూ వెంటనే అమలు చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్ కుమార్ పేర్కొన్నారు. పెంచిన మెస్ చార్జీలు, మెనూ వెంటనే అమలు చేయాలని కోరుతూ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ఈ విషయంలో జోక్యం చేసిన తగిన చర్యలు తీసుకోవాలని కోరారు . సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇన్చార్జి మేడిరాజు , పాల్గొన్నారు.

## విద్యుత్ సర్వీస్ వైరను మార్చాలి : బాబు శ్రీనివాస్



ఏఈ సంతోష్ బాబుకు వినతిపత్రం అందజేస్తున్న బాబు శ్రీనివాస్

**మలక్ పేట , నవంబర్ 8 , ప్రభాతవార్త :**

ఓల్డ్ మలక్ పేట్ మహంకాళి దేవాలయం వద్ద ఉన్న విద్యుత్ సర్వీస్ వైర్ ను తొలగించి ఇతర ప్రాంతంలోకి మార్చలని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యుత్ సర్వీస్ వైర్, విద్యుత్ స్తంభాన్ని తొలగించాలను కోరుతూ మలక్ పేట విద్యుత్ శాఖ ఎఇ సంతీష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్వీస్ వైర్, విద్యుత్ స్తంభం మూలంగా దేవాలయం కు వచ్చే భక్తులకు ఇబ్బందికరంగా ఉండడం తోపాటు ప్రమాదకరంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం, విద్యుత్ వైర్లను తొలగించి వేరే ఇతర ప్రాంతానికి మార్చాలని కోరారు

## మున్సిపాలిటీ సంపూర్ణాభివృద్ధికి కృషి చేస్తున్నాం - పండుగుల జయశ్రీరాజు, ఛైర్పర్సన్



సీసీరోడ్డు శంకుస్థాపనలో ఛైర్పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

**హయత్నగర్, నవంబరు 8 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ సంపూర్ణాభివృద్ధికి కృషిచేస్తున్నామని పెద్దఅంబర్పేట మున్సిపాలిటీ ఛైర్పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూర్ గ్రామంలోని 22వ వార్డు రత్నాకాలనీలో 40 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటుచేయనున్న సీసీరోడ్డు పనులకు శుక్రవారం ఆమె మున్సిపల్ కమిషనర్ రవీందర్రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వార్డుల వారిగా సమస్యలను తెలుసుకుని అవసరమైన మేర నిధులను కేటాయించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ పనులను ముందుగా చేపట్టి అనంతరం సీసీరోడ్లు ఇతర అభివృద్ధి పనులను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్చైర్మన్ చామసంపూర్ణా విజయశేఖర్రెడ్డి, కౌన్సిలర్లు చెవుల హరిశంకర్, అనుపమ సుప్రసేనారెడ్డి, నాయకులు కొండలగౌడ్ పాల్గొన్నారు.



ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్రెడ్డి తండ్రి బద్దం సుధాకర్రెడ్డి ఇటీవల మృతి చెందడంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం కార్పొరేటర్శ్వేత నివాసానికి వచ్చి పరామర్శించారు.

## పేద ప్రజలకు అన్యాయం జరగకుండా సవరణలు చేయాలి : ఎమ్మెల్యే

**మల్కాజిగిరి నవంబరు8,ప్రభాతవార్త :** రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ వక్ఫ్ బోర్డు సి.ఈ. ఓ ప్రకటన నేపథ్యంలో పేద ప్రజలకు అన్యాయం జరగకుండా సవరణలు కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాత్రోకు వినతి పత్రం అందజేశారు.దాదాపు 750 ఎకరాల విస్తీర్ణంలో 70 కాలనీలు బస్తీలు ఏర్పడ్డాయని ఇందులో స్థిరనివాసం ఏర్పరచుకొని దశాబ్దాలుగా ప్రభుత్వాలకు పన్నులు కడుతున్నారని, అలాంటి పేద మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు ఆడపిల్లల పెళ్ళిళ్ళకో చదువులకో అనారోగ్య భారిన పడ్డ సమయంలోనో వారి ఆస్తులను అమ్ముకోవడానికి వీలులేని విధంగా వక్ఫ్ బోర్డు సి.ఈ.ఓ ప్రకటనుందని, దశాబ్దాలుగా సదరు సర్వే నెంబర్లలో ప్రజలకు అన్ని వసతులు, సి.సి.రోడ్లు, కరెంట్



మీటర్లు, వీధిదీపాలు డ్రైనేజీ వ్యవస్థ వంటి సౌకర్యాలు ప్రభుత్వాలు కల్పిస్తూ వస్తున్నాయి.1954లో వక్ఫ్ చట్టం ఏర్పడినప్పటి నుండి ఎన్ని అధికారికి సర్వేలు నిర్వహించారో, ఎన్ని సర్వే నంబర్లు వక్ఫ్ భూములుగా నిర్ధారించారో, కబ్జాలు అవుతున్న సమయంలో వక్ఫ్ అధికారులు ఎంతమందికి నోటీసుకు జారీ చేశారో, ప్రకటించాలని కోరుతూ.వక్ఫ్ భూముల సంరక్షణకు తాను వ్యతిరేకం కాదని అయితే అక్కడే ఎన్నో ఏళ్లగా జీవిస్తున్న పేద ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం వ్యవహరించాలని కోరుతూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

## దేవాదాయశాఖ పరిధిలోకి ఉప్పల్ మహంకాళి ఆలయం

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** ఉప్పల్లోని ప్రసిద్ధ శ్రీ మహంకాళి ఆలయాన్ని దేవాదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల పిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు ఆలయాన్ని దేవాదాయశాఖలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దేవాదాయశాఖ సహాయక కమిషనర్ టి.శేఖర్, ఇన్స్పెక్టర్ ప్రణీత్కుమార్, దేవాదాయ శాఖ కార్యనిర్వహఖ అధికారులు అంజయ్య, ఎం.వీరేశం, శ్రీరాములు, శ్రీనివాసారావు, నర్సయ్య, కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పోలీసుల సహకారంతో ఆలయానికి చేరుకుని హుండీ సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఆలయ కార్యనిర్వహణ అధికారిగా ఎం.వీరేశంను నియమించినట్లు వారు తెలిపారు. ఇక నుంచి దేవాదాయశాఖ అధికారులు ఆలయ



ఉప్పల్ మహంకాళి ఆలయాన్ని స్వాధీనం చేసుకుంటున్న దేవాదాయశాఖ అధికారులు దృశ్యం.

నిర్వహణ చూస్తారని తెలిపారు. ఆలయం ప్రస్తుత నిర్వహకులపై ఫిర్యాదులు రావడంతోనే ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. కాగా తమ నుంచి ఆలయాన్ని తీసుకోవడం సబబు కాదని, కావాలనే కొందరు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ప్రస్తుత ఆలయ కమిటి నేతలు పేర్కొంటున్నారు. ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నాగోల్లో ఘనంగా చాట్ పూజ

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**

నాగోల్ డివిజన్ పరిధిలోని బీహార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నాగోల్ కోనేరులో నిర్వహించిన ఛాట్ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్రెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తర భారత రాష్ట్రమైన బీహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్లోని కొన్ని ప్రాంతాలకు ఒక ప్రముఖ పండుగ ఛత్ పూజ ఆచారాలు హిందూ క్యాలెండర్ మాసమైన కార్తీక మాసంలో ఆరవ రోజున ప్రారంభమవుతాయని అన్నారు. సూర్య భగవానుని ఆరాధించడం, కుటుంబం శ్రేయస్సు కోసం అతని ఆశీర్వాదాలు పొందడం వంటివి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణసురేందర్యాదవ్

సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ అసోసియేషన్ మౌర్య,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉప్పల్ పిస్తా హౌజ్లో ఫుడ్సేఫ్టీ అధికారుల తనిఖీలు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని పలు హోటళ్లు, బేకరీలపై ఫుడ్సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఉప్పల్లోని పిస్తా హౌజ్ బేకరీలో బొద్దింకలు, పురుగులు కనిపించాయని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. రంగంలోకి దిగిన జిహెచ్ఎంసి ఫుడ్సేఫ్టీ బృందం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. బేకరిలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, ఆహారం నాణ్యత పాటించడం లేదని నిర్ధారించారు. అనంతరం హోటల్ నిర్వహకులకు నోటీసులు జారీ చేశారు. అదే విధంగా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని లక్కీ, సురభి, యతి హోటల్స్లలో కూడా అధికారులు తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారీ, కిచెన్లో బొద్దింకలు, కాలం చెల్లిన సరుకులు గుర్తించినట్లు తెలిపారు. హోటల్ నిర్వహకులకు నోటీసులు జారీ చేశారు. నాణ్యత పాటించని వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.



ఉప్పల్ పిస్తా హౌజ్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు దృశ్యం

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పాండిపెంటయ్య



నియామక పత్రాన్ని అందుకుంటున్న పెంటయ్య

**హయత్నగర్, నవంబరు 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ కమిటీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పెద్ద అంబర్పేటకు చెందిన పాండి పెంటయ్యను నియమిస్తూ కాంగ్రెస్ కమిటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరిగారి ప్రీతం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు పెంటయ్యకు నియామక పత్రాన్ని అందిం చారు. ఈసందర్భంగా ప్రీతం మాట్లాడుతూ... క్షేత్రస్థా యిలో పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. పెంటయ్య మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## బాలాపూర్ చౌరస్తా సమీపంలో ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ ప్రారంభం



ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ను ప్రారంభిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**

బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఆసుపత్రిలో ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రివెంట్ బ్రెస్ట్ క్యాన్సర్ బ్లాక్ను లాంఛనంగా ప్రారంభిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మోమోమ గ్రామ్ సేవలను ఇక్కడి ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చినందుకు ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించా రు. అయితే పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, ఆసుపత్రి యాజమాన్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మీర్పేట్ కార్పొరేషన్లో కుటుంబ సర్వేను పరిశీలించిన జిల్లా అధికారులు



సిబ్బంది పని తీరును పరిశీలిస్తున్న సిపిఓ సౌమ్య

**సరూర్నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన ప్రక్రియను శుక్రవారం జిల్లా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి సౌమ్య, జిల్లా విద్యాధికారి సుశీందర్రావులు కార్పొరేష న్లోని మీర్పేట్ మిథిలానగర్, సీతాహోమ్స్, న్యూ గాయత్రీనగర్లలో జరుగుతున్న సర్వేకు సంబంధించిన ఇళ్ళ స్టిక్కరింగ్ను పరిశీలన జరిపారు. ఇందులో భాగం గా సర్వే సిబ్బంది పని తీరును పరిశీలించి వారికి దిశా నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆర్. జ్ఞానేశ్వర్, డిఇఇ వెంకన్న, ఆర్ఓ చంద్రశేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు : ఏఈ రామకృష్ణ

**కుషాయిగూడ నవంబర్ 8,ప్రభాతవార్త:** 33/11 కెవి సాకేత్ సబ్స్టేషన్ సాయిరాం నగర్ సాకేత్ 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలో కారణంగా శనివారం నవంబర్ 9 ఉదయం 11 గంటలకు నుండి సాయంత్రం నాలుగు గంటల 30 నిమిషాల వరకు సాయిబాబా నగర్ సాయి నగర్ శ్రీ కాలనీ డబల్ బెడ్ రూమ్ నివాసాలు ప్రాం తాలలో అంతరాయం కలుగుతుందని అందుకు ప్రజలు సహకరించాలని కుషాయిగూడ విద్యుత్ ఏఇ రామ కృష్ణ తెలిపారు



సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తో కలిసి పండ్ల బుట్టను అందించి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలియజేశారు.

## దేశ రాజకీయాల్లో అద్వానిది చెరగని ముద్ర : శంకర్రెడ్డి

**సరూర్నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** భారత దేశ రాజకీ యాల్లో ఎల్కె అద్వానీది చెరగని ముద్ర అని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్రెడ్డి అన్నా రు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో జరిగిన ఎల్కె అద్వానీ జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మిఠాయిలు కార్యకర్తలకు తినిపించి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయోధ్యలో రామజన్మ భూమి కోసం రథయాత్ర చేసిన అద్వానీ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాజుల మధు, రఘుగౌడ్, నవారు వేణు, సైదులు, శ్యామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలు మిఠాయిలు తినిపిస్తున్న శంకర్రెడ్డి

## హిందు సంస్కృతి, సాంప్రదాయలు, విలువల కార్యక్రమంలో లార్డ్స్ విద్యార్థులు

**సరూర్నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** నగరంలోని నాంపల్లి వనితా మహా విద్యాలయం ఆవరణలో జరిగిన హిందు సంస్కృతి, సాంప్రదాయలు, విలువలపై జరిగిన కార్యక్రమానికి బాలాపూ ర్ మండలం లోని లార్డ్స్ పాఠశాలల విద్యార్థులు తరలివెళ్ళారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరైన ఈ కార్యక్ర మంలో లార్డ్స్ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ బీరదర్ కిషన్రావులు మాట్లాడుతూ విద్యార్థులకు భారతీయ సం స్కృతి, విలువలు నేర్పు తున్నామని తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న లార్డ్స్ విద్యార్థులు

## రేపు అల్మాస్గూడ ఆర్కా స్కూల్లో కార్తీక కోటి దీపోత్సవం

**సరూర్నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లోని అల్మాస్గూడలోనున్న ఆర్కా ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం సాయంత్రం కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, పాఠశాల యాజమాన్యమైన ఏనుగు సింధు, తిరుమల్రెడ్డిలు తెలిపారు. జగన్మాత సేవకుడు మెళ్లూరి నవీన్ శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు కోటి దీపోత్సవ కార్యక్రమాలు ప్రారం భమవుతాయని వారు వివరించారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై కోటి దీపోత్సవంలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

## అర్హులైన పేదలకు డబుల్బెడ్రూమ్ ఇవ్వాలి

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**

అర్హులైన పేదలకు డబల్బెడ్రూమ్ ఇల్లు తక్షణమే మంజూరు చేయాలి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. సరూర్నగర్ మండల సమితి కౌన్సిల్ సమావేశం న్యూనాగోల్ ఎస్వి డాంగే భవన్లో మండల సహాయకార్యదర్శి బోయపల్లి రాములుగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు మండలంలో స్థానిక సమస్యలపైన దృష్టి సారించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలన్నారు. డిసెంబర్ 26న జరిగే పార్టీ 100 వార్షికోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సరూర్నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, సామిడి శేఖర్రెడ్డి, కందుల సుధాకర్, కమలమ్మ, శివ, క్రాంతి వినోద్, ఏం.మది లేటి, సుమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచితంగా వైద్యం అందించాలి : ఎం.పరమేశ్వర్రెడ్డి



రామంతాపూర్ వెంకటరెడ్డినగర్లో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :** నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు స్వచ్ఛంద సంస్థ లు ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందమల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్ వెంకట్రెడ్డినగర్ బస్తాం డ్లో ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్రెడ్డితోపాటు, కంది ఆగిరెడ్డి, బిల్లకంటి యాద య్య, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్య క్రమంలో పరమేశ్వర్రెడ్డి మాట్లాడు తూ పేదల కోసం ప్రతి ఒక్కరు తమ వంతు చేయూత అందించాలని, ప్రజల కోసం పని చేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నేతలు విజయ్, ధర్మేందర్ నాయక్, శ్రీనివాస్ చారి, బాలయ్య, నరేందర్, గడ్డం నరసింహా, సురేష్, మురళీ, సునీల్,మల్లయ్య, కిషోర్, రఘు, శ్రీరాములు, కనకయ్య, షబ్బీర్, మున్నా, బాపిరెడ్డి, మహిళా కాంగ్రెస్ నేతలు సంధ్య, శిరీష, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, నవంబరు 8 ప్రభాతవార్త :**

ఉప్పల్ భగాయత్ పరిధిలోని పలు ప్రాంతాలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నా మని భగాయత్ ఎఇ కిరణ్కుమార్రెడ్డి తెలిపారు. ఉప్పల్ 11 కెవి దేవేందర్నగర్ ఫీడర్ పరిధిలోని ఐడిఏ ఉప్పల్, లక్ష్మినారాయణ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యా హ్నాం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 11 కెవి శిల్పారామం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నాం 1.30 గంటల నుంచి 4.30 గంటల వరకు శిల్పారామం, ఉప్పల్ భగాయత్, డిమార్ట్, నాగోల్ మెట్రో స్టేషన్, గ్రీన్విచ్, భారత్ పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**రామంతాపూర్లో..** రామంతాపూర్లోని పిఎస్ కాలనీ ఫీడర్ పరిధిలోని రామంతాపూర్ పాలిటెక్నిక్ సబ్ స్టేషన్ పరిధిలో ఉద యం 11 గంటల వరకు సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎఇ రాములు తెలిపారు. పిఎస్ కాలనీ, శ్రీనివాసపురం, మధురానగర్, గోఖలేనగర్, గణేష్నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## కులగణనలో బ్రాహ్మణులందరూ నమోదు చేసుకోవాలి : మునిపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మునిపల్లి శ్రీనివాస్

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:**

కులగణనతో ఉపశాఖలకు అతీతంగా బ్రాహ్మణుల సంఖ్యా బలం నిరూపించుకునే అవకాశం ఆసన్నమైందని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన కార్యక్రమం విషయమై తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కేపురం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమా జంలో బ్రాహ్మణుల సంఖ్యా బలం చూపించుకొని అన్ని రంగాలలో బ్రాహ్మణులకు గుర్తింపు తెచ్చుకోవడానికి మంచి అవకాశం అన్నారు. బ్రాహ్మణ బంధుమిత్రులం దరూ ఈ కులగణన కార్యక్రమంలో ఉపశాఖల ప్రస్తావన కాకుండా కేవలం బ్రాహ్మణ కులంగా మాత్రమే నమోదు చేసుకొనుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్య క్రమంలో ప్రధానకార్యదర్శి భాస్కరమూర్తి, ఉపాధ్యక్షు లు బానగిరి నాగరాజు, కోశాధికారి రఘునందన్ పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

**హుడా కాంప్లెక్, నవంబర్ 8 ప్రభాతవార్త:** సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిల్వ వుంచిన రేషన్ బియ్యాన్ని సరూర్ నగర్ పోలీసులు స్వాదీనం చేసుకుని, నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇన్స్పెక్టర్ సైది రెడ్డీ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మద్యానం 2 గంటల సమయంలో అక్రమంగా ప్రభుత్వము ప్రజలకి ఇచ్చే రేషన్ బియ్యం ఇంద్ర హీల్స్ కాలనీ, సరూర్ నగర్ మండలం, రంగా రెడ్డి జిల్లా నందు కొంతమంది వ్యక్తులు నిల్వ ఉంచారని సమాచారము అందుకొని సిబ్బంది తో కలసి అట్టి ప్రదేశానికి వెళ్ళి తనిఖిలు నిర్వహించి అక్కడ వున్న 65 బ్యాగులు (30 క్వింటలు), ల బియ్యాన్ని స్వాదీనము చేసుకొన్నారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వవుంచిన బీహార్ కు చెందిన, ఇంద్రహిల్స్ లో నివాసం ఉంటున్న కుందన్ కుమార్ ను అదుపులోని తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నట్లు ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. ఇట్టి కేసులో తగు దర్యాప్తు చేసి దీని వెనుకాల వున్న వ్యక్తులపై కూడా కేసు నమోదు చేస్తాము అని తెలిపినారు. అంతేకాకుండా ఇక ముందు ఎవరైనా ప్రభుత్వము ప్రజలకి ఇచ్చే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ వుంచితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ తెలిపినారు.